క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు 699 మంది ఓటర్లు

ఉయ్యాలవాడ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 699 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ రవికుమార్ బుధవారం తెలిపారు. పట్టభద్రులు 676 మంది, ఉపాధ్యాయులు 23 మంది ఉన్నారన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

ఎథిక్స్, హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షకు 660 మంది గైర్హాజరు

నంద్యాల(సిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంటర్ మొదటి ఏడాది జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం నిర్వహించి ఎథిక్స్, హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షకు 660 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్టి తెలిపారు. ఈ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలోని 306 కళాశాలల్లో 33,772 మంది అలాట్ కాగా 33,112 మంది హాజరయ్యారని చెప్పారు.

17న డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే

ఆళ్లగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17వ తేదీన ఓపెన్ డే కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శివారెడ్డి బుధవారం తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతులు పరిశీలించుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో కలిసి ఇంటర్ విద్యార్థులు ముఖాముఖి చర్చించుకునే విధంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి

నంద్యాల(అర్బన్): బొమ్మలసత్రం వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ధ్వంసంపై విజయవాడలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు బుధవారం వినతి పత్రం అందజేశామని నంద్యాల జిల్లా సమతా సైనిక్‌దళ్ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ తెలిపారు. స్పందించిన కమిషన్ చైర్మన్ దుండగులు ఎంతటి వారైనా వేగవంతమైన విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని జిల్లా పోలీసులను ఆదేశించారని ఆయన చెప్పారు.

అదృశ్యం కేసు నమోదు

ఉయ్యాలవాడ : మహిళ అదృశ్యమైందని బాధిత తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సిద్దు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని బోడెమ్మనూరు గ్రామానికి చెందిన కమతం ఓబులేసు కుమార్తె(19) ఈ నెల 12న కాలనీలో కుళాయి వద్దకు నీళ్లకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం గాలించినా కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రాజోలి నిర్మాణ పనులు వెంటనే మొదలు పెట్టాలి

ఆళ్లగడ్డ: రాజోలి రిజర్వాయర్ నిర్మాణ పనులు వెంటనే మొదలు పెట్టాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు జాప్యంపై నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజోలి ఆనకట్టను సందర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రాజెక్టుల శంకుస్థాపనపై చూపిస్తున్న ఆసక్తి వాటి నిర్మాణాలు పూర్తి చేయడంలో చూపడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ముప్పాళ నాగేశ్వర రావు, హరినాథరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహానందికి చేరిన పెళ్లిపెద్దలు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో జరిగే శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి కళ్యాణోత్సవానికి పెళ్లిపెద్దలైన శ్రీ పార్వతీ, బ్రహ్మనందీశ్వరస్వామి వార్లు బుధవారం రాత్రి మహానంది చేరారు. మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం నంద్యాలకు వెళ్లిన విషయం తెలిసిందే. పెళ్లిపెద్దలతో కలిసి మహానందికి చేరుకున్నారు. నంద్యాలలో ఇరువురు గ్రామోత్సవంగా పర్యటించి భక్తుల చేత పూజలందుకుని తిరిగి మహానందికి వచ్చారు. కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం అనంతరం బ్రహ్మనందీశ్వరస్వామి దంపతులు నంద్యాలలోని ఆలయానికి వెళ్తారు.

స్వామికి ముత్యాల తలంబ్రాలు

మహాశివరాత్రి రోజున జరిగే స్వామికల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలను హైదరాబాద్‌కు చెందిన భక్తుడు శ్రీనివాసగౌడు అందించినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ. 50వేల విలువైన అర కిలో ముత్యాలను పంపించినట్లు చెప్పారు.

నల్లమలలో మంటలు

మహానంది: మహానంది సమీపంలోని ఆలయం వెనుక ఉన్న నల్లమల అడవిలో బుధవారం రాత్రి మంటలు వ్యాపించాయి. గత రెండ్రోజుల నుంచి నల్లమల అడవి కాలిపోతుందని సమీప గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నల్లమలలోకి ప్రవేశించి నిప్పు పెట్టడంతో మంటలు దావానంలా వ్యాపించాయి. సుమారు మూడు కిలోమీటర్ల మేరకు మంటలు వ్యాపించడంతో నల్లమల అగ్నికి కాలుతుందని, అటవీశాఖ సిబ్బంది స్పందించి మంటలను ఆర్పేయాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పొలంబడి... నూతన ఒరవడి

- పాక్షిక సేంద్రియ సాగుపై శిక్షణ
- ప్రతి రైతును శాస్త్రవేత్తలా చేయడమే లక్ష్యంగా తర్ఫీదు



డబ్ల్యూ కొత్తపల్లెలో చేపట్టిన పొలంబడిలో రైతులను సూచనలు ఇస్తున్న అధికారులు(ఫైల్)

దొర్నిపాడు: సేద్యం లాభసాటి కావాలి. సాంకేతిక సలహాలు, సాగు అధ్యయన అంశాలపై రైతులకు అవగాహన పెరగాలి. వ్యవసాయాధికారులు పొలం వద్దకే వెళ్లి సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియజేసి శాస్త్రీయసాగు విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించేలా కార్యాచరణ చేశారు అధికారులు. రైతులకు పంట సాగులో చేపట్టాల్సి సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడానికి చర్యలు చేపట్టారు. వ్యవసాయంలో నూతన ఒరవడిని తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాక్షిక సేంద్రియ(సెమి ఆర్గానిక్) వ్యవసాయాన్ని తీసుకవచ్చింది. అవసరం ఉన్నంత మేరకే పురుగుమందులు, ఎరువులను వినియోగించే విధానం. అయితే దీనిని రైతులకు చేరువ చేయడంలో భాగంగా ముందుగా మండలంలో పొలబడి కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఎంపిక చేశారు. గ్రామంలోని 250 ఎకరాల్లో 110 మంది రైతులను పాక్షిక సేంద్రియ పంటలను సాగు చేస్తారు. సాంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయం చేసే రైతులకు వాతావరణ పరిస్థితులకు నేల రకం ఆధారంగా పండించే పంటలు, చీడపీడ గురించి,నివారణ చర్యల గూర్చి అవగాహణ కల్పించడమే పొలబడి ముఖ్య ఉద్దేశం.

ఏ సీజన్‌లో ఏ పంటలు

ఖరీఫ్‌లో వేరుశనగ, వరి, మొక్కజొన్న, పత్తి, కొర్ర, మినుములు, పెసలు, కందులు, సజ్జ, పొద్దుతిరుగుడు, నువ్వులు, తదితర పంటకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యం మేరకు పొలబడులు నిర్వహిస్తారు. రబీలో వరి, పప్పుశనగ తదితర పంటలకు నిర్వహిస్తారు.

14 వారాలపాటు...

14 వారాల పాటూ నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన 250 ఎకరాల్లో ప్రతి 25 ఎకరాలకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకలుకు బాధ్యతలు అప్పగించారు. మొత్తం 14 వారాలు శిక్షణ ఇవ్వడంతో పాటు క్షేత్రస్థాయి సందర్శన ఉంటుంది. ప్రతి బుధవారం అక్కడ రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తారు. మితిమీరిన పురుగు మందుల వినియోగం తగ్గించి అవసరం ఉన్నంత మేరకే ఉపయోగంచేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు సాగులో వస్తున్న శాస్త్రీయపద్ధతులు వివరిస్తారు. పంటల బీమా పథకం, ఈ-క్రాప్ నమోదు, ప్రభుత్వం అందించే రాయితీలను వివరిస్తారు. సాగు ఖర్చు తగ్గించడానికి మిత్ర పరుగుల సంరక్షణ, సాగు విస్తీర్ణం పెంచడం తదిర అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించి రైతులను చైతన్య వంతం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో సేంద్రియ వ్యవసాయం చేయించడానికి పొలంబడి కార్యక్రమం రైతులకు మంచి అవకాశంగా మారింది. రైతను శాస్త్రవేత్తలా, ఓ నిర్ణయాధికారిగా చేడమే లక్ష్యంగా పొలంబడి ద్వారా పాఠాలు నేర్పుతున్నారు అధికారులు.

విత్తన శుద్ధి చేయడం నేర్చుకున్నా



నేను ఈసారి 40 ఎకరాల్లో శనగపంటను సాగు చేశా. ప్రతి ఏటా విత్త శుద్ధి చేయకుండా సాగు చేసేవాడిని. దీంతో పంట మధ్య తెగుళ్లతో చనిపోయేది. పొలంబడి కార్యక్రమం ద్వారా అధికారుల సూచనలతో విత్తన శుద్ధి నేర్చుకోని పంటను సాగు చేశా. అలాగే యాజమాన్య పద్ధతుల పాటించడంతో పెట్టుబడులు తగ్గడంతో పాటు మంచి దిగుబడులు వచ్చాయి.
– జాకీర్‌బాషా, డబ్ల్యూ గోవిందిన్నె

అధికారుల సూచనలు పాటిస్తున్నాం



పొలంబడి కార్యక్రమంలో భాగంగా అధికారుల సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించా. నేను మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. పాక్షికసేంద్రియ వ్యవసాయం చేయడం నేర్పిస్తున్నారు. సేంద్రియ ఎరువులు వినియోగించడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకున్నాం. –కృష్ణారెడ్డి, భాగ్యనగరం

ప్రతి రైతును శాస్త్రవేత్తలా చేయడమే లక్ష్యం



ప్రతి రైతును శాస్త్రవేత్తలా చేయడమే లక్ష్యంగా పొలంబడి నిర్వహిస్తున్నాం. 14 వారాల పాటు వారు మిత్ర శత్రుపురుగులను గుర్తించేలా చేస్తున్నాం. రసాయన ఎరువులు, పిచికారీ మందులను పూర్తిగా తగ్గించి సేంద్రియంపైపు దృష్టి సారించేలా శిక్షణ ఇస్తున్నాం. కార్యక్రమం మంచి సత్ఫలితాలను ఇస్తుంది. –శ్రీక్రిష్ణ, వ్యవసాయాధికారి, దొర్నిపాడు

ఘనంగా టైటాన్ వాచ్ షోరూం ప్రారంభం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని పద్మావతినగర్‌లో బుధవారం ప్రముఖ టైటాన్ వాచ్, కళ్లద్దాల షోరూం ప్రారంభం అయ్యింది. టైటాన్ కంపెనీ లిమిటెడ్ రీజనల్ బిజినెస్ హెడ్ శరద్ టైటాన్ షోరూంను ప్రారంభించారు. ఏపీపీ రాజనెరవాటి, సస్య పార్టనర్స్ ఆధ్వర్యంలో ఘనంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్టోర్ పార్టనర్ రాజశేఖర్ మాట్లాడుతూ టైటాన్ వాచ్‌లపై 40శాతం, కళ్లద్దాలపై 10శాతం వరకు తగ్గింపు ఇవ్వనున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


షోరూం ప్రారంభిస్తున్న శరద్, రాజనెరవాటి

ఆధ్యాత్మికతతోనే మనశ్శాంతి


ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారిని సన్మానిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : ఆధునిక సమాజంలో ఆధ్యాత్మిక చింతనతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ ముస్లీం మైనార్టీ నాయకుడు బాబులాల్ అన్నారు. మండల కేంద్రం చాగలమర్రి మసీదులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసి తిరిగి క్షేమంగా ఇళ్లు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చాగలమర్రి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ సోహైల్ ఫయాజ్, ఈఓ సుదర్శనరావు పాల్గొన్నారు.

ప్రారంభమైన చదరంగం పోటీలు


చెస్ ఆడుతున్న క్రీడాకారులు

నంద్యాల(సిటీ): స్థానిక వివేకానంద ఆడిటోరియంలో బుధవారం నంద్యాల జిల్లా స్థాయి అండర్-19 బాల బాలికల చదరంగం పోటీలు ప్రారంభం అయ్యాయి. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్ కర్నూలు చెస్ అసోసియేషన్ నిర్వహణలో జరిగిన పోటీలను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం క్రీడల్లో నంద్యాల క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతుండం అభినందనీయమన్నారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ మొదటిసారిగా నంద్యాల జిల్లాలో చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలుగా నిలిచినవారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ కళాశాలల మేనేజర్ ప్రగతిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు రామసుబ్బారెడ్డి, రత్నకుమార్, ఇమాం, సుజాత, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకపు బిల్లులు సక్రమంగా ఉండకపోతే చర్యలు


పురుగు మందులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

నంద్యాల(అర్బన్): పురుగు మందుల అమ్మకాలకు సంబంధించి దుకాణదారులు అమ్మకపు బిల్లులు సక్రమంగా ఉంచుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు సుధాకర్ హెచ్చరించారు. పట్టణంలోని సాయిరాం, రామేశ్వర, సంజీవరెడ్డి ఏజెన్సీలలను బుధవారం వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. పురుగు మందుల స్టాకు రిజిస్టర్, ఇన్‌వాయిస్, అమ్మకపు బిల్లులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సాయిరాం ఏజెన్సీలో రూ. 3.96 లక్షల విలువ గల పురుగు మందులకు సంబంధించిన ధ్రువ పత్రాలను చూపకపోవడంతో వాటి అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ అమ్మకాలకు సంబంధించి అన్ని పత్రాలు లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు కళ్యాణ్ కుమార్, స్వప్నికారెడ్డి తదితరులు ఉన్నారు.

సంపూర్ణపోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి


కిట్లను అందిస్తున్న కౌన్సిలర్ అనూషారెడ్డి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని 15వ వార్డు కౌన్సిలర్ సన్నల అనూషారెడ్డి తెలిపారు. స్థానిక గోపాల్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు బుధవారం సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం పంపిణీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త చిట్టెమ్మ, గర్భిణులు రజియా, ఝాన్సీ, గాయత్రి, హారిక, కాశమ్మ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ స్థాయిలో ఆందోళనలు నిర్వహించాలి


మాట్లాడుతున్న పులికొండన్న

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయమై రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల్లో అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేసే అవకాశం ఉందని, వాల్మీకులు ఐకమత్యంగా ఢిల్లీస్థాయిలో ఆందోళనలు తీవ్రతరం చేయాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయ పులికొండన్న పిలుపునిచ్చారు. స్థానిక దేవనగర్ వాల్మీకి కార్యాలయంలో బుధవారం డివిజన్‌స్థాయి వాల్మీకి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఎంతో మంది రాజకీయ నాయకుల మాటలు నమ్మి ఎన్నో ఏళ్లుగా ఎస్టీ జాబితాలో చేరక దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఏర్పాటు చేసిన కమిషన్ నివేదికలు పూర్తి అయ్యాయయని, వాల్మీకులు అప్రమత్తం కావాలన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి వాల్మీకులు రిజర్వేషన్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, సుబ్బరాయుడు, లాలుస్వామి, రమేష్ నాయడు, మహేష్‌నాయుడు, కాశన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోండి


మాచినేనిపల్లె లే అవుట్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ నాగరాజు, విద్యుత్ శాఖ డీఈఈ రంగస్వామి లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నె, మాచినేనిపల్లె గ్రామాల్లోని లే అవుట్లలో వేగవంతంగా సాగుతున్న గృహ నిర్మాణ పనులను బుధవారం వారు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు లబ్ధిదారులకు పలు సూచనలు ఇచ్చారు. ఉగాది నాటికి ఇళ్ల పనులు పూర్తి అవ్వాలని, అదే రోజు గృహ ప్రవేశాలు చేయాలన్నారు. ప్రభుత్వం బిల్లులు కూడా వెంటనే అందస్తోందని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదు ఉన్నారు.

వైజాగ్‌లో కిడ్నాప్.. తాడివారిపల్లెలో హత్య

- ఘాట్ రోడ్డులో కాలిన మృతదేహం కేసులో వీడిన మిస్టరీ
- అక్రమ సంబంధమే దేవధరణి హత్యకు కారణం
- యువతితో వల విసిరి, క్లోరోఫామ్ ఇచ్చి దారుణ హత్య


హత్య ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


దేవధరణి(ఫైల్)

పాదిలిరూరల్: ఒంగోలు-నంద్యాల రహదారిలో తాడివారిపల్లె చెక్‌పోస్ట్ సమీపంలో కాలిన మృతదేహం కేసులో మిస్టరీ వీడింది. అక్రమ సంబంధం నేపథ్యంలో బత్తుల దేవధరణి అనే యువకుడిని దారుణంగా హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బుధవారం రాత్రి పాదిలి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి యువకుడి హత్య కేసు వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం పెద్ద ఎమ్మనూరు గ్రామానికి చెందిన బత్తుల దేవధరణి(22) చిన్నప్పటి నుంచి చెడు వ్యవసనాలకు బానిసై తిరుగుతుండేవాడు. మహిళలకు ఫోన్ చేసి మాట్లాడటం, ఆకతాయితనంగా ఉండటంతో తన అన్న పవన్ సాయి విశాఖపట్టణంలో తన దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడే ఇంటర్ వరకు చదివించడంతోపాటు ఓ రెస్టారెంట్లో పనిలో చేర్చాడు. చదువు మధ్యలో ఆపేసిన దేవధరణి నిత్యం సామాజిక మాధ్యమాల్లో చాటింగ్ చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో గంగ అనే యువతి పరిచయం కాగా ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. గంగకు ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తితో ముందే అక్రమ సంబంధం ఉంది. దీంతో దేవధరణి, ప్రవీణ్‌కుమార్ మధ్య తరచూ వివాదం నడుస్తోంది. వీరిద్దరితో పవన్‌సాయి మాట్లాడి సర్దుబాటు చేసినప్పటికీ గంగతో దేవధరణి చాటింగ్ చేయడం మాత్రం ఆపలేదు. దీంతో దేవధరణిని అడ్డు తొలగించాలని ప్రవీణ్‌కుమార్ పథకం రచించాడు. అహోబిలం వెళ్లేందుకని చెప్పి జనవరి 30న బాడుగకు కారు మాట్లాడాడు. మనోజ్, చాణక్య, శివకుమార్, నరేష్, స్వప్న అనే యువతితో దేవధరణిని నమ్మబలికించి కారులో ఎక్కించారు. మార్గమధ్యంలో దేవధరణికి క్లోరోఫామ్ ఇచ్చి స్పృహలో లేకుండా చేశారు. క్లోరోఫామ్ ప్రభావంతో దేవధరణి కారులోనే మలమూత్రాలు విసర్జించడంతో తర్లుపాడు మండలం తాడివారిపల్లె ఘాట్ రోడ్డులో కారు ఆపి కిందకు దించారు. అటవీ ప్రాంతంలో కత్తితో గొంతు కోసి, పెట్రోల్ పోసి కాల్చి చంపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి దేవధరణి కనిపించకపోవడంతో సోదరుడు పవన్‌సాయి విశాఖపట్టణం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులు చంపడానికి ఉపయోగించిన బాడుగ కారు డ్రైవర్ శివకిరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో నేరం అంగీకరించాడు. నిందితుల్లో ఒకరు అరెస్టయ్యాడని, మిగిలిన వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. సమావేశంలో పొదిలి సీఐ సుధాకర్‌రావు, తర్లుపాడు ఎస్సై ముక్కంటి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన హుసేన్‌బాషా(33) చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. కొద్దిరోజులుగా కిడ్నీ వ్యాధితో బాధతుపడుతున్న హుసేన్‌బాషా జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. వెంటనే కోవెలకుంట్ల వైద్యశాలకు చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య ఫైజున్ పాటు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి చెప్పారు.

కోటకొండకు చెందిన శ్రీనివాసులు...

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండకు చెందిన శ్రీనివాసులు(44) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఆ వ్యక్తి వ్యవసాయంతో జీవనం సాగించేవాడు.అయితే వ్యవసాయం కలిసి రాకపోవడంతో అప్పులు పెరిగాయి. బ్యాంక్,ప్రైవేటు వ్యక్తుల వద్ద చేసిన అప్పు తీర్చే దారి కన్పించలేదు. దీంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి పడిపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉందని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు మృతుడి భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం సురక్షితం

ఉయ్యాలవాడ : ప్రతి రోజు సైక్లింగ్ చేయడం వల్ల ఉత్సాహంగా ఉల్లాసంగా గడపంతో ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని వైద్యాధికారి రమేష్ చంద్రబాలాజీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో విద్యార్థులతో సైకిల్ ర్యాలీ చేపట్టారు. వైద్యాధికారి మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల బరువు నియంత్రణ, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. రక్తపోటు నివారణకు కూడా దోహదపడుతుందన్నారు.

గాజులపల్లెలో చోరీకి యత్నం

మహానంది:గాజులపల్లెలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు కలర్స్ ఉమాదేవి ఇంట్లో బుధవారం చోరీ యత్నం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ప్రధాన ద్వారం వద్ద ఉన్న గడియను తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. రెండు బీరువాలు ఉండగా ఓ బీరువాను పగలగొట్టి చోరీకి యత్నించారు. సమీపంలో ప్రజలు గుర్తించి కేకలు వేయడంతో పరుగులు తీసినట్లు స్థానికులు తెలిపారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు చేస్తున్న కార్మికులు

శిరివెళ్ల: జీనేపల్లెలో రూ. 10 లక్షలతో చేపట్టిన అంతర్గత సిమెంట్ రోడ్డు పనులను బుధవారం సర్పంచ్ దగడ మహేశ్వరి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతు ఇటీవల ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాథ్‌రెడ్డి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు రూ. 20 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో సిమెంట్‌రోడ్లు, మురిగు కాల్వల నిర్మాణాలు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


కూరగాయల తక్కెడ, తూకం రాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ : నిత్యావసర వస్తువుల ధరలను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించినా తూనికలు, కొలతలలో మోసాలకు పాల్పడినా అమ్మకదారులపై కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఖాజా హుస్సేన్ హెచ్చరించారు. పట్టణంలోని పలు వ్యాపారా దుకాణాలతో పాటు సంత మార్కెట్‌లోని కూరగాయల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూకపు రాళ్ల బరువులు, త్రాచులపై ముద్రలను పరిశీలించారు. వస్తువుల కొలతలు, తయారీ తేదీలు, నాణ్యత లోపాలతో అనుమతుల్లేకుండా సరుకులు నిల్వ ఉంచుకున్న దుకాణాల నిర్వాహకులకు జరిమానా విధించారు. నిబంధనలు పాటించని సుమారు పది దుకాణాదారులకు రూ. 11,500 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

ఈ పంట నమోదు పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

గోస్పాడు: రబీ సీజన్లో వ్యవసాయ సిబ్బంది నిర్వహించిన ఈ-పంట నమోదుపై బుధవారం డీడీఏ రవీంద్రబాబు సూపర్ చెక్ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎస్ కూలూరు గ్రామంలో రైతులు సాగు చేసిన పైర్లను వ్యవసాయ సిబ్బంది ఇప్పటికే ఈ పంట నమోదు పూర్తి చేశారు. అయితే అందులో రైతుల వివరాలు ఎంత మేరకు సక్రమంగా ఉన్నాయో లేదో అన్న విషయాలపై ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తిరిగి సూపర్ చెక్ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కమిషనర్ కార్యాలయం నుంచి రాండంగా సెలెక్ట్ చేసిన సర్వే నెంబర్ల జాబితాలో ఉన్న రైతులు, పంటల వివరాలు ఈ పంట నమోదు చేసిన జాబితా ప్రకారం ఎంత మేరకు ఉన్నాయన్న విషయాన్ని పొలాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం రైతులను విచారించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు అబ్దుల్ హక్, ఆయుబ్ భాష, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.